క్లుప్తంగా

లైవ్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సుధన్ పవర్

నేరడిగొండ: గిరిజన లంబాడాల ఐక్యవేదిక (లైవ్) బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జిగా సుధన్ పవర్ నాయక్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ తెలిపారు. లైవ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేశ్ నాయక్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

నేరడిగొండ: రైతుబీమా పథకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో జైపాల్ అన్నారు. సోమవారం మండలంలోని మాట్లొద్ది గ్రామంలో రైతుబీమాకు సంబంధించి జాబితాలో సవరణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకునే రైతులు అప్లికేషన్ ఫారం, పాసుబుక్, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డుతో సంతకం పెట్టి సంబంధిత ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

జలపాతం సందర్శనకు రావద్దు

బజార్‌హత్నూర్: మండలంలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటం, ఎగువ ప్రాంతం నుంచి నిరంతరం వరద వస్తుండటంతో గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల కనకాయి జలపాతం సందర్శనకు పర్యాటకులకు అనుమతి లేదని ఎస్సై నరేశ్ తెలిపారు. సోమవారం కనకాయి జలపాతంకు వెళ్లే దారిలో ఇచ్చోడ, సొనాల ఆర్‌అండ్‌బీ రోడ్డులో గమనిక బోర్డు ఏర్పాటు చేశారు.

కొబ్బరి సాగుకు ప్రోత్సాహకాలు, రాయితీ

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నీటి వసతి కలిగిన రైతులు కొబ్బరి సాగు చేయవచ్చని ఆసక్తి కలిగిన రైతులకు కొబ్బరి అభివృద్ధి సంస్థ ప్రోత్సాహకాలు, రాయితీలు ఇవ్వనుందని ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ అన్నారు. ఒక్కో రైతు 10 ఎకరాల (4 హెక్టార్లు) వరకు రాయితీ పొందవచ్చని, ఒక హెక్టారుకు 150 మొక్కలు నాటవచ్చని, సీడీబీ నర్సరీ, ఏలూరు నందు ఒక్కో మొక్క ధర రూ. 80 ఉంటుందన్నారు. ఒక హెక్టారుకు రాయితీ రూ. 6.500 దీనిని మొదటి రెండు సంవత్సరాల్లో రెండు సమ భాగాలుగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు ఉద్యాన అధికారి సుదీర్‌కుమార్ 90323 13933 సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీని ఇతర భవనంలోకి మార్చాలి

బేల: మండల కేంద్రంలోని శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం– 3ని ఇతర భవనంలోకి మార్చాలని సోమవారం మండల తహసీల్దార్ సవాయిసింగ్‌కు గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్ వందన వినతిపత్రం అందజేశారు. భారీ వర్షం వస్తే స్లాబ్ ఊరుస్తోందని, కూర్చోలేని దుస్థితి నెలకొంటుందని, ఎప్పుడు కూలుతుందోని భయం వేస్తుందన్నారు. స్పందించిన తహసీల్దార్ శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

తలమడుగు: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లింగాల చిన్నన్న, సీఐటీయూ ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

‘చిత్రకళాకారులకు అండగా కాంగ్రెస్’

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ చిత్రకళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో తెలంగాణ ఆదివాసీ చిత్రకళ అసోసియేషన్ ఆవిర్భావ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నుకున్న టీపీసీసీ కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చిత్రకారులు పాండురంగ్, సోయం విక్రమ్, సునీల్, వెంకటేశ్వర్‌రావు, సిడాం నగేశ్, మధుకర్, గణేశ్, రూపేశ్, ఛత్రుఘన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలి

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయం సమావేశం నిర్వహించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమశాఖలో జరుగుతున్న బదిలీలు, పదోన్నతులలో పండిత్, పీఈటీ పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మూగ శ్రీనివాస్, జాదవ్‌అశోక్ కుమార్, దిలేశ్ చౌహాన్‌లు శీతల్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పూర్తయ్యేదెప్పుడో?


భవనం వెనుక వైపు కొనసాగుతున్న పనులు

- నత్తనడకన భవన నిర్మాణ పనులు
- ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగింపు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

తాంసి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నా.. అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారుల అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వ విద్యాలయాలకు సొంతంగా భవనాలు నిర్మించడం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన ఏళ్లుగా భవనాల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండంతో ప్రభుత్వ విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు నేటికి ఇబ్బందులు తప్పడం లేదు. భీంపూర్ మండల కేంద్రంలో కేజీబీవీ విద్యాలయానికి స్వంత భవన నిర్మాణానికి ప్రభుత్వం మూడేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. మూడేళ్లుగా భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. భవన నిర్మాణ పనులు పూర్తికాక అద్దె భవనంలో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో గత్తేదారు సక్రమంగా పనులను చేపట్టకపోవడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. గత మూడేళ్లుగా భవన నిర్మాణ పనులు పూర్తయి ఈ ఏడాది భవనం అందుబాటులోకి వస్తుందనుకున్న విద్యార్థినుల ఆశలు నెరవేరలేదు. సొంత భవనం లేక జిల్లా కేంద్రంలోని తాత్కాలిక అద్దె భవనంలో కేజీబీవీ కొనసాగడంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు.

భవన నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు..

కేజీబీవీ సొంత భవన నిర్మాణానికి గత మూడేళ్ల క్రితం ప్రభుత్వం రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం మండలంలో 2015– 16లో కేజీబీవీని ఏర్పాటు చేసింది. మండలంలో కేజీబీవీ ఏర్పాటు చేయడానికి సరైన వసతులు లేక తాత్కాలికంగా జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలోని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. కేజీబీవీలో 300కు పైగా మండల విద్యార్థినులు చదువుకుంటున్నారు. తాత్కాలిక భవనంలో సరైన వసతులు లేక అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రంలో ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి సొంత భవన కోసం మూడేళ్ల క్రితం నిధులు కేటాయించారు. మూడేళ్లుగా కొనసాగుతున్న పనులు నేటికి పూర్తి కావడం లేదు.

విద్యార్థినులకు ఇబ్బందులు..

అసంపూర్తిగా ఉన్న కేజీబీవీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తే బాగుటుంది. మిగిలి ఉన్న పనులను గుత్తేదారుతో పూర్తిచేయించి తరగతులు ప్రారంభిస్తే విద్యార్థినులకు ఇబ్బందులు తప్పుతాయి. స్థానికంగా కేజీబీవీ లేకపోవడంతో విద్యార్థినులకు, తల్లితండ్రులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీసారి తమ పిల్లలను చూసేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని తల్లితండ్రులు సైతం వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేయించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం

భీంపూర్ కేజీబీవీ నిర్మాణ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. భవన నిర్మాణంలో భాగంగా అదనంగా మళ్లీ బ్లాక్‌ల నిర్మాణ చేపట్టడానికి నిధులు మంజూరయ్యాయి. అదనంగా మళ్లీ పనులు చేపట్టడం ద్వారా కొంత ఆలస్యం జరిగింది. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించాం.
– సుమంత్, ఏఈ టీఎస్ఇడబ్ల్యూఐడీసీ

ప్రతిఒక్కరూ ప్రకృతిని కాపాడాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ ప్రకృతిని కాపాడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఏక్ పేడ్ మాకే నామ్ అభియాన్‌లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కళాశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గొప్ప ఆలోచనతో వాతావరణ సమతుల్యత కోసం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమ రవి, జోగు రవి, ఆకుల ప్రవీణ్, దినేష్ మాటోలియా, శివ, భూమన్న, కళాశాల ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

ముదిరాజుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తవిస్తా

ఆదిలాబాద్‌రూరల్: ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తవిస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు ఆవరణలో ముదిరాజ్‌లు భీమన్న పండుగను నిర్వహించారు. ఈ పండుగలో పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం, ముదిరాజ్ సంఘం నాయకులు సలేందర్ శివయ్య, రవి, సంతోష్, రాజు, వెంకటి, శివ, నగేశ్, పొచ్చన్న, గంగన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ


కొయ్యాడి గంగయ్యను సన్మానిస్తున్న సభ్యులు

నేరడిగొండ: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని హ్యూమన్ రైట్స్ బృందం జిల్లా అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణలు అన్నారు. మండలంలోని కుప్టి గ్రామంలో గల జాతీయ రహదారి పక్కన మొక్కల వనం ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్న సామాజిక కార్యకర్త కొయ్యాడి గంగయ్యను సోమవారం శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గంగయ్య వివిధ శాఖల అధికారులతో మొక్కలను నాటిస్తూ వాటిని సంరక్షిస్తున్నారని తెలిపారు. ఇలాంటివారు సమాజానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ బృందం జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్, లింగమూర్తి, వెంకటరమణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న పండుగ


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన భీమన్న పండగను సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. గురుపౌర్ణమి తర్వాత వచ్చే తొలి సోమవారం రోజున ప్రతీఏడాది ఈ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భీమన్న విగ్రహంతో జిల్లా కేంద్రంలో డప్పుచప్పుళ్ల మధ్య భారీ శోభాయాత్ర చేపట్టారు. పట్టణంలోని అశోక్‌రోడ్‌లోని వడ్రండి ఇంటి నుంచి భీమన్న దేవుని విగ్రహంతో ప్రారంభమైన శోభాయాత్ర గాంధీపార్కులో నూతనంగా నిర్మించిన భీమన్న దేవుని ఆలయం వరకు సాగింది. భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు నారాయణ, శివయ్య, సంతోష్ , రాజు, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ చంద్రశేఖర్ ఆశయాలు కొనసాగించాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: విప్లవోద్యమంలో 50 ఏళ్లు ప్రజల కోసం ఎనలేని త్యాగం చేసిన సీపీఐ (ఎంఎల్) కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్, కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయాలను సాధించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగన్‌సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు అజ్మీర వినోద్, జిల్లా కార్యదర్శి కుమ్ర అశోక్, కోడప సురేశ్, మడావి రేణుక, బుచ్చిరాం, సావిత్రబాయి, బల్వీర్ సింగ్, ఖన్నా, జోసఫ్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న జీసీడీవో మెస్రం ఛాయ

ఇచ్చోడ: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోస్టుమెట్రిక్ బాలికల హాస్టల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సంకల్ప్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు చట్టాలు, హెల్ప్‌లైన్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో పురుషులతో మహిళాలు అన్ని రంగాల్లో సమానంగా ఎదగాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే పురుషులతో పోటీ పడేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి, హాస్టల్ వార్డెన్ కాత్లె లలిత, ఉపాధ్యాయులు అశ్విని, విద్యార్థినులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: బ్యాంకర్లు రుణమాఫీ విషయంలో రైతులను ఇబ్బంద పెట్టవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం బ్యాంకు అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఎమ్మెల్యే వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు. బ్యాంకు మేనేజర్‌తో, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా రుణమాఫీ చేసిందని, దళారి వ్యవస్థను ప్రోత్సహించకుండా నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బు జమచేయాలని సూచించారు.

పేదల ఆకలి తీర్చేందుకు భొజ్జన్న బువ్వ

సుదూర ప్రాంతాల నుంచి ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే ఆర్జీదారుల కోసం ప్రతీ సోమవారం భొజ్జన్న బువ్వ కార్యక్రమం చేపట్టడం జరుగతుందని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట బొజ్జన్న బువ్వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఐటీడీఏకు వచ్చిన గిరిజనులకు అన్నం వడ్డించారు. నాయకులు చంద్రయ్య, ఎక్బాల్, నర్సయ్య ఉన్నారు.

స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా సాగాలి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలువురు తంతోలి గ్రామస్తులు పలువురు భుక్తాపూర్ కాలనీవాసులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయలేని ఎన్నో మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఒక చారిత్రాత్మక నిర్ణయమన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, గిమ్మ సంతోష్, ఫైజుల్లా ఖాన్, రాందాస్ నాక్లే, చరణ్ గౌడ్, సామ రూపేష్‌రెడ్డి, కలాల్ శ్రీనివాస్, దర్శనాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయం వద్ద పడిగాపులు

- రుణమాఫీ కోసం రైతుల ఇబ్బందులు


ఐకేపీ కార్యాలయం వద్ద రైతులు

నేరడిగొండ: రుణమాఫీ డబ్బులు రైతులకు అందించడంలో బ్యాంకర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండలంలోని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. సోమవారం ఐకేపీ కార్యాలయం వద్ద వారి సంతకాల కోసం పడిగాపులు కాశారు. బ్యాంకర్లు ఐకేపీలో రుణాలు లేవని, సంతకాలు తీసుకుస్తేనే డబ్బులు ఇస్తున్నారని అంటున్నారని పేర్కొంటున్నారు. ఇలాంటి వాటితో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రుణమాఫీ అయిన రైతులకు వెంటనే డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

గిరిజనేతరుల భూములకు పత్రాలు ఇవ్వాలి


క్షీరాభిషేకం చేస్తున్న గిరిజనేతర రైతులు

ఇంద్రవెల్లి: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర రైతుల భూములకు పహాణీ పత్రాలు ఇచ్చి, రైతుభరోసాతో పాటు రైతుబంధు, రుణసౌకర్యం కల్పించాలని గిరిజనేతర సంఘం నాయకులు సోమోరే నాగోరావ్, రాంనివాస్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గిరిజనేతర రైతులతో కలిసి రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏజెన్సీలో 1970కన్న ముందు నుంచి గిరిజనేతరులు సాగుచేస్తున్న ప్రభుత్వ భూములకు వెంటనే హక్కుపత్రాలు జారీ చేసి, రుణమాఫీ, రైతుభరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనేతర రైతులు కాంబ్లే ఫీరాజీ, ముండే గణేష్, ఆచార్య గోపినాథ్, సంజీవ్‌రెడ్డి, సుందర్‌సింగ్, ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం కోఆర్డినేటర్

ఇంద్రవెల్లి: విద్యార్థినులు విద్యార్థి దశ నుంచే మహిళ రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మహిళ సాధికారత కేంద్రం, సఖీ కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. సోమవారం మండలంలోని ముత్నూర్ మినీ గురుకులం పాఠశాలలో విద్యార్థినులకు మహిళ రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో యాక్ట్, బాల్య వివాహాల చట్టం, గృహహింస చట్టం, బేటీ బచావో బేటీ పడవో పథకం, మిషన్ శక్తి పథకం గురించి వివరించారు. సిబ్బంది నాగమణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా మహి శా సాధికారత, సఖీ కేంద్రం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు అవగాహన సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా న్యాయవాది జగన్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల చట్టం రైట్ ఎడ్యుకేషన్ యాక్ట్, కొత్త నేర న్యాయచట్టాల గురించి వివరించారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, నాగమణి, ప్రత్యేకాధికారి సువర్ణ పాల్గొన్నారు.

క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

నార్నూర్: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రతీగ్రామంలో శానిటేషన్, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ఖైర్డాట్వా గ్రామాన్ని తనిఖీ చేశారు. శానిటేషన్, క్లోరినేషన్ పనులను పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నీటి నిల్వ వలన దోమలు తయారై మలేరియా, డయేరియా, డెంగ్యూ వంటి రోగాలు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ఆయన వెంట ఎంపీవో ఆనంద్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్: మండల కేంద్రంలోని సమస్యలు పరిష్కరించాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారసంతలో మూత్రశాల నిర్మాణం తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. సాయినగర్ కాలనీలో రోడ్ల నిర్మాణం, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని కోరారు. త్వరలోనే సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కప్పర్ల పాఠశాలలో సైన్స్ మేళా

తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ సైన్స్ మేళా నిర్వహించారు. భౌతిక రసాయన, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన పలు ప్రయోగాలను ప్రదర్శించి సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ప్రయోగాలను స్వయంగా పరిశీలించి సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకున్నారు. సైన్స్ మేళా ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పెరిగే అవకాశం ఉందని పాఠశాల హెచ్‌ఎం ఆనంద్ అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సువర్ణ, నవీన్, ఉపాధ్యాయులు కిష్టన్న, సంతోష్, విలాస్ గౌడ్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ‘శిక్షా సప్తాహ్’

జైనథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం జాతీయ విద్యా విధానం నాల్గోవ వార్షికోత్సవం సందర్భంగా ‘శిక్షా సప్తాహ్’ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఇంటర్ ఇంటర్ విద్యార్థినులు అలేఖ్య, అక్షయ బృందాలు తయారు చేసిన ‘జల సంరక్షణ’ పోస్టర్ ఆలోచింపజేశాయి. శృతి బృందం తయారు చేసిన మట్టి గణపయ్య విగ్రహాలు ఆకట్టుకున్నాయి. వీరిని గైడ్ టీచర్ చిందం ఆశన్న, ప్రధానోపాధ్యాయులు జావిద్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

‘స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి’

ఎదులాపురం: దివ్యాంగులకు రిజర్వేషన్ వర్తించదంటూ ఆరోపణలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా దివ్యాంగ నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సలీం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఐఏఎస్ హోదాలో ఉన్న అధికారి ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నాయకులు ముత్యాల సురేశ్, బావునే నగేశ్, ప్రమోద్ కుమార్, రాజశేఖర్, పొచన్న, ఊషన్న, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కాకూడదని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని రైతువేదికలో 26 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో పేద కుటుంబాలు సంతోషంగా ఉన్నాయన్నారు. పేద కుటుంబాలకు కేసీఆర్ అండగా నిలబడ్డారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, తాహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు పాల్గొన్నారు.